# 13

## ఉన్నాడా!?

గాలి ఒక్కటే కాక ఉన్నట్లుండి చినుకులు కూడా పడటం మొదలుపెట్టాయి. అసలే చిరాగ్గా ఉన్న నాకు ఈ వానా గాలితో మరింత హెచ్చింది విసుగు. కారుస్పీడు హెచ్చించి వైపర్సు ఆన్ చేశాను. వైపర్సు రెండూ వయ్యారంగా కదులుతూ ఒకటి రాణీలా, మరొకటి కళావతిలా కనపడుతున్నాయి నా కంటికి. నా చికాకుకీ, కోపానికీ మూలకారణమైన వాళ్ళరూపాలు కంటిముందు కదలాడగానే మరింత చిర్రు బుర్రులాడింది మనసు.

మొదట రాణీ దగ్గరకెళ్లాను ఇందాక... ముక్కుతూ మూలుగుతూ పడుకుని వుంది. రాత్రినుంచీ జ్వరంట. లేవలేకపోతోందిట... నెలకి పదిరోజులు ఆవిడగారికి మూలుగులే. తిట్టుకుంటూ గడపదాటుతుంటే "మందు కొనుక్కుంటాను. ఒక్క రెండ్రూపాయలయినా..." అంటూ గొణిగింది వెనకనుంచి ఒళ్ళు మండింది. విసురుగా జేబులోంచి అయిదురూపాయలనోటు తీసి మంచంమ్మీద గిరాటేసి మళ్ళీ వెనక్కి తిరిగి చూడకుండా బయటపడ్డాను. తిన్నగా కళావతి ఇంటికెళ్ళాను. వెక్కిరిస్తూ ఇంటికి తాళం కప్ప కనపడింది.

"ఎవరి మొహం చూసి బయల్దేరానో... ఇవ్వాళ నా పుట్టిన రోజు కూడా... ఎంతో సంతోషంగా బయలుదేరితే ఈ గతేమిటి నాకు?" అనిపించింది.

పక్కింటి గుమ్మంలో నిలబడ్డ పదేళ్ళ కుర్రాడు, తాళం కప్పకేసి ఓసారీ, నా మొహంలోకి ఓసారీ చూసి "ఆవిడ ఊరెళ్ళింది అర్జంటు పనిమీద. వారం రోజులగ్గానీ రాదుట. తనకోసం ఎవరన్నా వస్తే చెప్పమంది నన్ను" అన్నాడు.

కాలుతున్న సిగరెట్ బలంగా నేలకేసి కొట్టాను. అటు చూస్తే ఆవిడగారు... ఆ రాణీగారు పడక... ఇటు చూస్తే ఈవిడగారు ఊరెళ్ళింది. అయినా, మొన్నరాత్రి తనొచ్చినప్పుడు మాట మాత్రంగానయినా ప్రయాణం సంగతి తనతో చెప్పలేదే? అంత అర్జంటుపని ఏం తగిలిందబ్బా అని ఆశ్చర్యం వేసింది.

ఎటుపోతున్నానో నాకే తెలియకుండా డ్రైవ్ చేసుకుపోతున్నాయి నా చేతులు.

ఆలోచనల్లో, పొద్దున్న ముకుందంతో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది.

"నువ్వాడవాళ్ళ జీవితాల్తో ఆటలాడటం ఇంకా మానలేదన్నమాట".

చాలా ఏళ్ళ తర్వాత కల్సుకున్నాం ముకుందం, నేనూ.

"వాళ్ళు కూడా చేతులు కలిపితేనే కదా నే నాడుతున్నదీ? నా వల్లే వాళ్ళ జీవితాలు నాశనమయిపోతున్నట్లు మాట్లాడతావేమిటి?" ముకుందం మొహం అదోలా పెట్టాడు నా జవాబు నచ్చక.

"కుసుమ జీవితం నీవల్లకాదా నాశనమవుతా?" ఎన్నాళ్ళబట్టో, నేనెప్పుడైనా కనపడితే ఈ ప్రశ్న వెయ్యాలని ఎదురు చూస్తున్న వాడిలా వుంది ముకుందం ధోరణి. అతనెంత సీరియస్‌గా అడిగాడో అంత తేలిగ్గా నవ్వేశాను నేను.

"ఇన్నేళ్ళ తర్వాత కూడా కుసుమ నీకు గుర్తుందే? నీ జ్ఞాపకాల తెరల్లో కుసుమ బొమ్మ వెలిసిపోలేదన్నమాట. ఆల్‌రైట్.... అడిగావు కనక చెప్తున్నాను. ఆ కుసుమదే తప్పంటాను నేను. పెళ్ళిగురించి నా అభిప్రాయం ఏమిటో ముందే అడిగితే ఆ ఏడుపు ఉండకపోను కదా! నేను పెళ్ళి చేసుకోకపోతానా అన్న ధైర్యంతో నాతో తిరిగింది నాకు పెళ్ళి చేసుకునే ఉద్దేశ్యమే లేదని ఓ శుభముహూర్తాన చెప్పగానే 'నేను తల్లిని కాబోతున్నాను. అయ్యో! నాకిప్పుడేం దారి? ఇంత మోసం చేస్తావనుకోలేదు... నిన్ను పిచ్చిగా ప్రేమించాను' అంటూ గుండెలు బాదుకుంటూ ఏడ్చింది. నీ ఏడుపు నువ్వేడవమని నా దారిని నేను పోయాను... ఇన్నేళ్ళయింది. మళ్ళీ మేమిద్దరం ఎదురుపడలేదు. అయినా, కుసుమ గురించి ఇన్నేళ్ళ తర్వాత కూడా నీ కెందుకంత దిగులు? ఎవడినో కట్టుకుని ఎక్కడో సంసారం వెలగబెడుతూనే ఉండి ఉంటుందిలే". నా మాటలకు ముకుందం మొహం ఎర్రబడటం గమనించక పోలేదు నేను.

"నువ్వు చాలా పొరపాటు పడ్డావు. నిన్ను ప్రాణసమంగా ప్రేమించింది కుసుమ. నువ్వు మోసం చేసి పోగానే తన భవిష్యత్తు అంధకారమయమై పోయిందని బాధపడుతూ అగ్నిపర్వతాలు గుండెల్లో దాచుకుంది. కన్నవాళ్ళచేత, కానివాళ్ళచేత 'ఛీ' అనిపించుకుంది. అందరూ వెలివెయ్యగా ఒంటరిదయిపోయింది. నీ ప్రతిరూపంగా భగవంతుడు తనకిచ్చిన బిడ్డని పెంచి పెద్ద చేసేందుకు పడరానిపాట్లు పడింది. కాయకష్టం చేసి, కలో గంజో తాగి కూతుర్ని చదువులో పెట్టింది. తన కూతురి జీవితమైనా మూడుపువ్వులూ ఆరుకాయలుగా నడవాలన్నదే ధ్యేయంగా పెట్టుకుంది. నీతిగా బతకాలని అష్టకష్టాలు పడుతుంటే, మగదిక్కులేని సంసారం కావడంతో "కులట" అని ముద్రవేసేసి, ఇంటిచుట్టూ రాబందుల్లా తిరిగి పీక్కుతింటూ, చివరకు, కుసుమను నీచవృత్తిలోకి దింపింది ఈ సంఘం... ఇదంతా నీవల్లనే జరిగింది... కాదనగలవా?" కుసుమతో నా పరిచయం, ప్రేమ, ఆ తర్వాత నేను పత్తా లేకుండా పోవటం అన్నీ పూసగుచ్చినట్లు తెల్సు ముకుందానికి. అందుకే కుసుమ పతనానికి నన్ను దోషిగా నిలబెడుతూ "కాదనగలవా?" అంటూ సవాలు చేశాడు.

తరగని ఆస్తినాది. పెళ్ళీ, పెటాకులూ, బాదరబందీలేమీ లేకుండా బతికినన్నాళ్ళూ హాయిగా అనుభవించాలన్న కోరికతో జల్సాగా జీవితాన్ని గడుపుతూ ఊళ్ళమీద పడ్డాను నేను. ఉద్యోగరీత్యా ఊళ్ళమీదపడ్డాడు ముకుందం.

నా కిప్పుడు నలభయ్యయిదేళ్ళు. కానీ, చూడ్డానికి నేనలా కన్పించను. నా వయసు ముప్ఫయ్యేడో ముప్ఫఎనిమిదో అంటే తెలియనివాళ్ళు తేలిగ్గా నమ్మేస్తారు. ఆ మాట నాకు నేనుగా చెప్పుకోవడం కాదు. నన్నెరుగున్న వాళ్ళందరూ అదే మాట అన్నారు. ముకుందం కూడా నా ఈడు వాడే. కానీ అతను మరో అయిదేళ్ళు పెద్దవాడిలా కనపడతాడు.

చాలా ఏళ్ళ తర్వాత, ఈ ఊళ్ళో, ఈ ఉదయం ఎదురుపడ్డాం మేమిద్దరం.

అప్పుడే నడిచింది మా ఇద్దరి మధ్యా కుసుమని గురించిన సంభాషణ.

అసలతనా ప్రస్తావన తీసుకురావడమే నాకు నచ్చలేదు. అందుకే చివరికి కాస్త కోపం మిళాయించి "పాపం" కుసుమ చాలా కష్టాల్లో ఉందన్నమాట. ఈ ఊళ్ళోనే ఉంటోందన్నావు కదా! ఏదీ? ఆవిడగారి అడ్రసేమిటో చెప్పు. పాతికో పరకో

చేతిలో పెట్టొస్తాను. నాలుగు రోజులు కడుపునిండా కాస్త అన్నం తింటుంది" అన్నాను సిగరెట్ పొగ విలాసంగా వదులుతూ.

"ఛీ" అని చీత్కరిస్తూ నాతో మాట్లాడటం మరి ఇష్టం లేనట్లు, నా ముందునించి వెళ్ళిపోయాడు ముకుందం.

అక్కడితో ఆ గొడవ వదిలిపోవటంతో నాకూ సంతోషమే అనిపించింది. లేకపోతే, ఇన్నేళ్ళ తర్వాత కలుసుకున్న స్నేహితుడితో మాట్లాడటానికింకేమీ లేనట్లు పాతికేళ్ళనాటి పాతగాథలు తవ్వటమెందుకో ఈ పాతికేళ్ళల్లోనూ మరెన్నో కుసుమాలు నా చేతుల్లో నలిగాయంటే గుండెలు బాదుకుంటాడు పిచ్చి ముకుందం.

ఎవడెలా ఏడ్చిపోతే నాకేమిటి? జీవితాన్ని రాజాలా అనుభవిస్తున్నాను.

నా బుఱ్ఱలో ఆలోచనలు తిరుగుతూనే ఉన్నాయి.

నా చేతుల్లో స్టీరింగ్‌వీల్ తిరుగుతూనే ఉంది.

వాన కురుస్తూనే ఉంది.

దూరంగా రోడ్డు పక్కన చెట్టుకింద ఒక ఆకారం హెడ్‌లైట్ కాంతిలో కనపడింది.

కారు స్లో చేశాను.

ఇంత చీకట్లో, ఈ గాలీ, వానలో, ఈ నిర్మానుష్య వీధిలో ఎవరా మనిషి?!

ఆకారం దగ్గరవుతున్నకొద్దీ ఆ నిలబడ్డది ఒక స్త్రీ అని గుర్తించాను... ఒంటరి ఆడది... ఈ నిర్జన ప్రదేశంలో... ఇంత రాత్రప్పుడు?!... నా స్వభావానికి అలవాటు పడిపోయాయి నా చేతులు... ఆడపురుగు కనపడితే ఆగి నిలబడి చూసే స్వభావం నాది... అందుకే నా బుర్రకి శ్రమ ఇవ్వకుండానే, కారుని ఆమె పక్కగా ఆపాయి నా చేతులు.

ఇరవయ్యేళ్ళుంటాయేమో? నాజూగ్గా వుంది. అంతకు మించిన అందంగా ఉంది. ఎటొచ్చీ ఆ మొహంలో, ఒంటరిగా ఆ స్థలంలో వానలో చిక్కుపడిపోయినందుకో ఏమో భయం, బెదురూ కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నాయి. నా వంక భయం, భయంగా చూస్తూ ఒకడుగు వెనక్కి వేసింది.

"ఎక్కడికి వెళ్ళాలీ లిఫ్ట్ ఇస్తాను" అడిగాన్నేను ఆ పిల్ల అందాన్ని కళ్ళతో తాగేస్తూ.

వణుకుతున్న గొంతుతో ఎక్కడికి వెళ్ళాలో చెప్పింది.

"రా... ఎక్కు..." అంటూ ఫ్రంటు డోర్ తెరిచాను.

వెనుక కూచుంటే మంచిదేమోనన్నట్లుగా వెనక సీటు వైపు చూస్తూ నిలబడింది.

"త్వరగా ఎక్కు. ఇంకా తడిసిపోతావ్" అన్నాను. అదివరకే ఆ అమ్మాయి సగం తడిసినట్లు కనిపిస్తూనే ఉంది.

భయం భయంగా నా పక్కన ఒదిగి కూర్చుంది.

కారు స్టార్టు చేశాను.

ఆ అమ్మాయితో కబుర్లు చెప్పాలనిపించింది.

రాణీ, కళావతీ ఇద్దరిలోనూ ఏ ఒక్కరి కంపెనీ లేక తిక్కగా వున్నానేమో... ఇప్పుడీ అమ్మాయిని నాకు కంపెనీగా దేవుడే పంపించాడనిపించింది. అందుకే తొందరగా ఆ అమ్మాయిని గమ్యానికి చేర్చదల్చుకోక కారు చాలా స్లోగా డ్రైవ్ చెయ్యడం మొదలుపెట్టాను.

"చాలా అర్జంటు. ఎంత త్వరగా తీసికెళితే అంత పుణ్యం మీకు" తల తిప్పి నా వైపు చూసిందా అమ్మాయి.

"పుణ్యం" అన్న మాటకి చచ్చే నవ్వు వచ్చింది నాకు.

ఆ మాట నా డిక్షనరీలో లేదని ఆ అమ్మాయి కేం తెలుసు పాపం. పగలబడి నవ్వాను.

హడలిపోయింది నా నవ్వుకి.

"ఏం కథ? ఏవిటంత అర్జంటు? ఎవర్ని కల్సుకోవాలి?"

ఒక్క క్షణం మౌనం తర్వాత జవాబిచ్చింది. "నా స్నేహితురాలి తల్లిని".

ఈ జవాబు నేనూహించిన విధంగా లేదు.

"అంత అర్జంటైతే మరి కాలినడకన బయల్దేరావేం? ఏ టాక్సీలోనో వెళ్ళక?"

"నేను చాలా బీదదాన్ని..."

"ఓ..." అంత అందమైన అమ్మాయి బీదదంటే నా కేదో చేదు తిన్నట్టుగా అనిపించింది.

"స్నేహితురాలి తల్లిని చూడటానికి అంత ఆత్రుత పడిపోతున్నావు... ఎందుకో ఏమిటో కారణం నేను తెలుసుకో వచ్చా?" నా కుతూహలం, పైగా కాలక్షేపం.

"వింటారా?"

నవ్వొచ్చింది. కానీ, ఈ సారి ఆ అమ్మాయి జడుసుకునేట్లు నవ్వలేదు.

"విందామనేకదా అడుగుతున్నాను చెప్పు".

ఆ అమ్మాయి చెప్పటం మొదలుపెట్టింది.

"నాకు మల్లేనే నా స్నేహితురాలు సుజాతా బీదదే. నాకు మల్లేనే దానికీ తల్లి తప్ప నా అన్నవారెవరూ లేరు. కూతురి కోసమే ప్రాణం నిలబెట్టుకొని జీవచ్ఛవంలా బతుకీడుస్తోందావిడ. పొరుగూళ్ళో హాస్టల్లో వుంచి కూతుర్ని చదివిస్తుంది. తల్లికి ఒంట్లో బాగోలేదని మంచం పట్టిందనీ తెల్సి నిన్న ఈ ఊరొచ్చింది సుజాత ఇవాళ... ఇవాళ..." గొంతు బొంగురు పోయి చెప్పడం ఆపేసింది.

తర్వాతేం జరిగిందో చెప్పమన్నట్లుగా చూశాను.

మొహం పక్కకు తిప్పుకుని చిన్నగా నిట్టూర్చింది.

కిటికీ అద్దాలు మూయ్యడం మర్చిపోయానేమో చల్లటి గాలి రివ్వునవచ్చి నా వంటిని ఝల్లుమనిపించింది. అప్రయత్నంగా నా చెయ్యి ఆ అమ్మాయి నడుం చుట్టూ పాకింది. ఏపామో తనను చుట్టుకున్నంతగా బెదిరిపోతూ ముందుకి జరిగింది. నమ్మలేనట్టుగా నా వైపు చూసింది. నేను కారు మరింత స్లో చేసేశాను. ఆ అమ్మాయి నడుం చుట్టూ చుట్టుకుని ఉన్న నా చేత్తో నా వైపు దగ్గరగా లాక్కున్నాను.

చిన్నగా కంపిస్తూ, ఏదో మాట్లాడబోయి, మాట్లాడటానికి కూడా ధైర్యం చాలనట్టు, కన్నీళ్ళుక్కటే తక్కువగా, అదురుతున్న పెదవులతో నావైపు చూసింది.

"నీ కోరిక ప్రకారం, నువ్వు చెప్పినచోటికి తీసుకెళ్తున్నాను కదా మరి... నా కేమిస్తావ్?" అన్నాను.

తడబడిపోతూ, "నేనే మివ్వగలను? నేను చాలా బీదదాన్నని మొదటే మీకు చెప్పుకున్నాను కదా!" అంది వెంటనే. అప్రయత్నంగా నా చెయ్యి జేబులోకి వెళ్ళి రెండు వందనోట్లతో వచ్చింది బయటికి. "ఇదుగో".

"ఏమిటి?"

"నువ్వు ఊ అంటే అప్పుడప్పుడిలాగే నా జేబులో డబ్బు నీ చేతిలో వొచ్చి వాల్తుంది" అన్నాను గర్వంగా ఆమె కళ్ళల్లోకి చూడటానికి ప్రయత్నిస్తూ. తల్లి తప్ప వేరెవ్వరూ లేరని, బీదదాన్నని చెప్పుకుని ఉండడమే నన్నిలా ప్రోత్సహించి పురికొల్పిం దనుకుంటాను.

చటుక్కున తల దించుకుంది.

"నే నటువంటి దాన్ని కాదు".

సడన్ బ్రేక్‌తో కారు ఆపాను.

జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా ఉన్న చెట్లతో, చిమ్మ చీకటిగా, నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రదేశంలో ఆగింది కారు. ఓ పక్క చలిగాలి... మరోపక్క అందం, నాజూకు తనం కలబోసుకున్న పడుచుపిల్ల.

"నువ్వు అరిచి గీపెట్టినా నిన్ను రక్షించే నాథుడీచుట్టుపక్కల లేడు..." నవ్వాను.

"మీకు పుణ్యం ఉంటుంది. నా స్నేహితురాలి తల్లిని అర్జంటుగా చూడాలి... ఈ గాలీవానలో దేవుడే మీరూపంలో వొచ్చి నాకు సహాయ పడుతున్నాడనుకున్నాను, మీరు లిఫ్ట్ ఇస్తానని అడగ్గానే... నేను చెప్తున్న కథనుకూడా మీరు పూర్తిగా ఇంకా వినలేదు... వింటే మీరిలా ప్రవర్తించరేమో?"

"లాభం లేదు... ఏ కథలూ, కన్నీరూ నన్ను కరిగించలేవు. పాపం! నా సంగతి నీకు తెలియదు... సరే... స్నేహితురాలి తల్లిని కల్సుకోడం చాలా అర్జంటు అంటున్నావు కాబట్టి తీసికెళ్తాను. తీసికెళ్ళనని అనట్లేదు. కానీ రేపు నా కోరిక తీరుస్తానని మాట ఇవ్వగలవా? అలా అయితేనే, ఇప్పుడీ కారు కదుల్తుంది... లేకపోతే..." ఆమె నడుం చుట్టు నా చెయ్యి బలంగా బిగుసుకుంది. రెండు చేతులూ జోడించింది.

"అలాగే మాట ఇస్తున్నాను. మీరన్నదానికి ఒప్పుకుంటున్నాను. మీకు పుణ్యం ఉంటుంది. నన్ను తొందరగా..." గొంతులో దుఃఖం అడ్డుపడగా మరి మాట్లాడలేక పోయింది.

ఇలాంటివాళ్ళని లొంగదీసుకోవడం పెద్ద కష్టం కాదనిపించింది నాకు. అంగబలం, అర్థబలంలేని ఇలాంటి అందాలెన్నో అవలీలగా అనుభవించి ఉన్నవాడిని... ఈ అమాయకమైన అందాన్ని ఇవాళ కాకపోతే రేపైనా అనుభవించగలను. నా

తెలివి తేటలమీద, నా శక్తిమీద నాకు నమ్మకముంది... నా అనుభవంలో గెలుపుకే తప్ప ఓటమికి చోటు లేదు... ఉండకూడదు.

"ఆల్‌రైట్... నీ మాటమీద నమ్మకముంచుతున్నాను; నా పట్టుదలమీద నాకు అపనమ్మకం లేదు కాబట్టి". కారు స్టార్టు చేశాను.

"ఊ! ఇప్పుడు చెప్పు మిగతా కథ" అడిగాను. ఆ కథవింటేనన్నా నా మనసు మారుతుందేమోనన్న ఆశతో కాబోలు గబగబా చెప్పడం మొదలుపెట్టింది.

"సుజాతా వాళ్ళింటి సందులోనే ఉంటున్న రౌడీ ఒకడు ఇవాళ పొద్దున్న, దగ్గరగా వేసి ఉన్న తలుపులు తోసుకుని సుజాతా వాళ్ళింట్లో జొరబడ్డాడు. మంచాన పడివున్న సుజాతతల్లి లేచి వచ్చి అడ్డుకోలేదని తెల్సి, పెద్దపులిలా సుజాతమీదికి వచ్చాడు. చేతులు జోడించి బతిమాలింది సుజాత. ఏడ్చింది, మొరపెట్టుకుంది, తిట్టింది దేనికీ వాడు చలించలేదు. "ఆ తల్లి కూతురివి కాదా? అలవాటు లేనట్టు నటన చెయ్యకు... అనవసరంగా అరిచి గోల చేశావంటే నీకే ముప్పు. నీ తల్లే సిగ్గుతో వంగిపోయేటట్టు కథ అల్లి ప్లేటు ఫిరాయించగలన్నేను నలుగుర్లోనూ" అంటూ మీదికి వస్తున్న వాడినించి తనని రక్షించుకుందుకు, చేసేది లేక, తప్పనిసరిగా, చేతికందిన పచ్చడిబండ తీసుకుని బాదింది వాడిని సుజాత. రక్తం కాలవలు కట్టింది. కొన ప్రాణంతో వాడు గిలగిలా కొట్టుకుంటుంటే వాళ్ళూ, వీళ్ళూ పోగయ్యారు. పోలీసులకు కబురు వెళ్ళింది. అరెస్టు చేస్తారన్న భయంతో సుజాత దొడ్డిగుమ్మంలోంచి పారిపోయింది ఇల్లొదిలి... ఇవన్నీ నాకు తెలిసేటప్పటికి చాలా ఆలస్యమైంది. వాళ్ళమ్మ మంచంలోంచి లేవలేకుండా పడివుంది. అందుకే నేను వెళుతున్నాను. ఆవిడని చూసేందుకు".

"మరి అక్కడికి వెళ్ళేందుకు నీకు మాత్రం భయంగా లేదూ?" నా ప్రశ్నకి జవాబు రాలేదు.

ఇంకా ఏవేవో అడగాలనుకున్నాను.

ఒక్కటీ అడగలేదు. ఇంతలో మేము చేరవలసిన చోటు రానే వచ్చింది.

"ఇక్కడాపేసెయ్యండి. ఆ సందులోకి కారు వెళ్ళదు".

సందు మొగలో ఆపాను.

దిగి, థ్యాంక్సు చెప్పింది.

"దేవుడే మీ రూపంలో వొచ్చి నాకు సహాయపడ్డాడు" అని కూడా అంది.

"దేవుడు లేడనే వాళ్ళల్లో నేనొకణ్ణి... అందుకని నన్నలా పోల్చకు... అయినా నా గురించి నీకు పూర్తిగా ఏం తెలుసనీ? తెలిస్తే పొరపాటున కూడా నన్ను పొగడవు... అన్నట్టు రేపెక్కడ కల్సుకోమంటావు?" రాణీ, కళావతీల కంటే ఎన్నో రెట్లు అందంగా వున్న, ఈ చిన్నారి బొమ్మని అంత త్వరగా వదులుకో బుద్ధికాలేదు.

"అక్కడే" సన్నగా వణికిందామె గొంతు.

"ఈ సందులో కుడివైపు పెద్ద వేపచెట్టున్న మూడో ఇల్లే నే నిప్పుడు వెళుతున్నది..." చెప్పింది మళ్ళీ.

"అది నీ స్నేహితురాలి ఇల్లన్నావుగా?"

"వాళ్ళమ్మగార్ని చూసుకుంటూ ఇక్కడే ఉంటాను... ఆవిడకి తోడుగా..."

"సరే... గుడ్ నైట్. రేపు కలుద్దాం".

✧ ✧ ✧

మర్నాడు పొద్దున్న కాఫీ తాగుతూ పేపరు చూస్తూండగా ఇన్స్పెక్టరు రాజారావు వచ్చాడు. మా ఇద్దరికీ బాగా స్నేహం ఉంది. అతను రోజూ డ్యూటీకి మా ఇంటిముందు నించే వెళ్ళాలి. అతనీమధ్య మా ఇంటికి వొచ్చి చాలా రోజులైపోయింది. ఇవాళింత పొద్దున్నే నా దగ్గరికి రావడం ఆశ్చర్యమే అనిపించింది. "రావోయ్! రా! ఏవిటింత పొద్దున్నే డ్యూటీ డ్రెస్సులో నా ఇంట్లో అడుగు పెట్టావు? చూసినవాళ్ళు అపార్థం చేసుకోగలరు?" నా మాటలకి విరగబడి నవ్వాడు.

"ఇవాళ రాత్రి ఒక మూడు నాలుగు గంటల సేపు నిన్ను మా ఇంట్లో అరెస్టు చేసి పడెయ్యాలనుకున్నాను. అందుకే ఆహ్వానం అందించేసి పోదామని, డ్యూటీలో పడితే మళ్ళీ మర్చిపోతానేమోనని వెళ్ళేముందు ఇలా వచ్చాను".

"ఏవిటి విశేషం?"

"ఇవాళ మా పెళ్ళయిన రోజు. పెళ్ళికాని వాడివి నిన్ను పిలవాలనిపించింది భోజనానికి, వొస్తావా?"

"తప్పకుండా! ఏవంటోంది ఉద్యోగం! ఈ మధ్య చాలా బిజీగా ఉంటున్నావు..."

"సరే ఉద్యోగం సంగతే అడిగావూ? రోజూ హత్యలూ, ఆత్మహత్యలూ... వాళ్ళు చావడం కాదు కానీ, మా చావుకొస్తోందనుకో" విసుగులో హాస్యం మిళాయించాడు రాజారావు.

"నిన్న నొక అమ్మాయి. ఒకడిని పచ్చడి బండతో తల పగలకొట్టింది. మాకు కబురు అంది మా వాళ్ళు వెళ్ళేసరికే, అరెస్టు చేస్తారన్న భయంతో ముందే ఇంట్లోంచి పారిపోయింది. అయిపులేదు! ఇప్పుడు పొద్దున్నే కబురేమిటో తెల్సా? ఆ అమ్మాయి తన ఇంట్లోనే, తెల్లారేటప్పటికి ఆత్మహత్య చేసుకుపడుంది. మంచాన ఉన్న తల్లి పోగానే వెంటనే ఈ అమ్మాయి ఏదో మింగిందట..."

నా కనుబొమ్మలు ముడిపడ్డాయి.

నిన్న రాత్రి నా కార్లో ఎక్కిన అమ్మాయి చెప్పిన కథకీ రాజారావు చెపుతున్న దానికీ తేడా లేదు. ఎటొచ్చీ ఆ పారిపోయిన అమ్మాయి ఆత్మహత్య విషయమే ఇప్పుడు నేను కొత్తగా వింటున్నది...

"మరి నే వెళ్తాను... ముందు స్టేషన్‌కి వెళ్ళి తర్వాత ఆ చోటికి వెళ్ళాలి. ఆల్ రెడీ మా బలగం వెళ్ళిందక్కడికి" రాజారావు వెళ్ళిపోయాడు.

నాకు కాలు నిలువలేదు.

తలుపులు వేసుకోమని నౌకరుతో చెప్పి, కారు బయటికి తీశాను.

తన స్నేహితురాలూ, స్నేహితురాలి తల్లీ ఇద్దరూ పోయాక ఇంక ఆ అమ్మాయి అక్కడెందు కుంటుందీ? వెళ్ళిపోతుందేమో? అందుకే పిట్ట నా చెయ్యి జారిపోతుందేమో నన్న ఆత్రుత నాది.

సరిగ్గా నిన్నరాత్రి ఆపిన చోటే కారు ఆపి, ఆ సందులోకి నడిచాను.

వేపచెట్టున్న మూడో ఇంటిముందు జనం గుమిగూడి ఉన్నారు. గోల గోలగా ఉంది.

ఆ మందలోకి నడిచాను.

నా కళ్ళు నిన్న రాత్రి నా కార్లో ఎక్కిన అమ్మాయి కోసం వెతుకుతుండగా, నా పక్కన మాట్లాడుకుంటున్న వాళ్ళ మాటలు నా చెవుల్లో పడ్డాయి.

ఒకావిడ ఇంకో ఆవిడతో అంటోంది. “మా అమ్మ లేకుండా నేను బతకలేను. ఒంటరిగా నేను జీవించడం మొదలుపెడితే మా అమ్మకి పట్టిన గతే నాకూ పట్టదని హామీ ఏముంది?” అంది చివరి మాటలుగా పాపం! వెఱ్ఱిపిల్ల... తల్లిప్రాణం గాలిలో కలవగానే ఆత్మహత్య చేసేసుకుంది... పాపం... కళ్ళు తుడుచుకుంటూ ఇంకా ఏదేదో చెప్తోందావిడ.

నేను ముందుకి నడిచాను.

ఇంట్లోకి తొంగిచూశాను.

నా నెత్తిన పిడుగుపడినట్టయింది.

నేలమీద అస్తవ్యస్తంగా పడివుంది నిన్న రాత్రి నా కార్లో వచ్చిన అమ్మాయి.

నా కేదో అర్థమవుతున్నట్టనిపించింది.

తన కథే తన స్నేహితురాలి కథగా చెప్పిందన్నమాట. నాకు తెలియకుండానే నా మనసు నిట్టూర్చింది. అటువైపు చూశాను.

కుక్కి మంచంలో మరో ప్రాణం లేని కట్టెగా ఆ అమ్మాయి తల్లి పడిఉంది... ఆ మొహం ఎక్కడో చూసిన మొహంలా అనిపించింది. నుదురు చిట్లిస్తూ మరింత పరీక్షగా చూశాను... ఆ ముక్కుమీద పుట్టుమచ్చ నా గుండెని చీల్చింది... నా కాళ్ళు వణికాయి. ఆ మొహం వంకే చూస్తున్న నా మనసు మూగపోయింది. ఆ కింది పెదవికింద వున్న ఆ చిన్నిగాటు నా హృదయానికి పెద్దగాటే పెట్టింది... ఔను... కుసుమే... నా పెదవులు అప్రయత్నంగా “కుసుమ” అన్నాయి. “కుసుమ మీకు తెల్సా బాబూ!” నా పక్కనున్నావిడ దీర్ఘం తీసింది.

నా నుదురు, మెడ చెమటతో తడిసి ముద్దయిపోయాయి.

ఇలాగే ఈ క్షణంలో నా గుండె ఆగిపోతే బావుండుననిపించింది.

“కుసుమా! ఈ సుజాత నీ కూతురా?... అదే... అదే... మనమ్మాయా?... మంచి పని చేశావు సుజాతా... మంచి పనేచేశావు. నువ్వు బతికుంటే నీ కన్నతండ్రే... భగవాన్!” మరి ఆలోచించడానిక్కూడా ధైర్యం చాల్లేదు.

ఎన్నడూ తల్చుకోని భగవంతుడిని అప్రయత్నంగా మొదటిసారి తల్చుకుంటూ “ఉన్నాడా... దేవుడు?” అనుకున్నాను.

భరణి మాసపత్రిక